క్లుప్తంగా

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



సత్తెనపల్లి: అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ అనుకోకుండా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు భయపడకుండా దాన్ని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



నకరికల్లు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నకరికల్లులో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన చేజర్ల ఎస్‌వీఎస్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం షేక్.పాహిం మాట్లాడుతూ త్రోబాల్, కబడ్డీ, వాలీబాల్, షాట్‌పుట్ పోటీల్లో మండల స్థాయిలో విద్యార్థులు హర్షిత, వినీత, రాజశేఖర్, వెంకట్‌సాయి, శృతి, పల్లవిబాయి, స్వామినాయక్, జాన్‌బాబు, అరవింద్, శైలు బహుమతులు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులు ఎస్.లలిత, పఠాన్ మల్లిక, చెరుకూరి వెంకటేశ్వరరావు, షేక్.మస్తాన్‌వలి, గేరా మోహన్‌రావు, ఏసి హెచ్.వెంకట్రావు, బత్తుల సుందర్రావు, పీఈటి షేక్.గౌస్ విద్యార్థులను అభినందించారు.

నూతన పింఛన్లు పంపిణీ



రాజుపాలెం: గణపవరం గ్రామ సచివాలయం వద్ద కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండలాభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలో 38 మందికి వివిధ సమాజిక పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ మంచు నందనం, మాజీ సర్పంచ్ గన్నుపల్లి వెంకటరమణ బుల్లిబాబు, పంచాయతీ కార్యదర్శి మహంకాళమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కొదమల బాబు, పల్లపాటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



సత్తెనపల్లి: ఎస్సీ వర్గీకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే చట్టబద్ధత కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశెటి వేణుగోపాల్ కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పార్లమెంట్ సమావేశాల్లో షెడ్యూల్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్ష సత్తెనపల్లి పట్టణంలో మంగళవారం 3వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశెట్టి వేణుగోపాల్ ప్రారంభించి, మాట్లాడారు. దీక్షలో పల్నాడు జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ కనుమూరి కోటేశ్వరరావు, ఎంఎస్‌పీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ జంగాల శ్రీనివాసరావు, మాజీ నియోజక వర్గ నాయకులు బొక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ



పెదకూరపాడు: పెదకూరపాడులోని జనచైతన్య సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎస్సై విప్పర్ల వెంకట్రావు మాట్లాడుతూ పర్యావరణానికి ఎలాంటి హాని కలుగకుండా ఉండేలా మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని పిలుపునిచ్చారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర మెడికల్ ఫ్యాన్సీ స్టోర్స్ నిర్వాహకుడు నరేంద్రబాబు సహకారంతో 500 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసినట్లు జనచైతన్య సమితి నిర్వాహకుడు దాసరి విజయబెన్నిబాబు, అనిల్‌కుమార్, కె.లక్ష్మీకాంత్, డి.కారుణ్య, టి. సాంబశివరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

- వాడవాడలా కొలువుదీరి.. పూజలందుకున్న గణనాథుడు
- వివిధ రూపాల్లో బొజ్జగణపయ్యకు భక్తిశ్రద్ధలతో పూజలు
- అన్న సంతర్పణలు, ముగ్గుల పోటీలు



సత్తెనపల్లిలోని మద్దివారి బావి సెంటర్‌లో పూజలందుకున్న వినాయకుడు



పట్టణంలోని నాగన్నకుంటలో గణనాథుడు



కోటమ్మసత్రం సెంటర్‌లో సాంబశివరావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



రాజుపాలెంలో జయంతి కాలనీ గణనాథుడి పూజలో భక్తులు



నకరికల్లు చౌత్రా సెంటర్‌లో గణనాథుడు



ముప్పాళ్ళలోని రామాలయంలో..



అచ్చంపేట రోడ్డులోని కోటమ్మ సత్రం సెంటర్‌లో..



కొత్తపేట భావనారుషి దేవాలయం వద్ద..

సత్తెనపల్లి: వినాయక చవితి పర్వదిన వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. మండలాల్లోని గ్రామాల్లో వాడవాడలా వివిధ రూపాల్లోని వినాయక విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వివిధ రకాల పత్రిలను స్వామికి సమర్పించారు. అన్న సంతర్పణ, ముగ్గులు తదితర పోటీలను నిర్వహించి, భక్తులను ఉత్సాహపరిచారు. సత్తెనపల్లి పట్టణంలోని 25వ వార్డు అచ్చం పేటరోడ్ లోని కోటమ్మ సత్రం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు సందర్శించి, పూజలు నిర్వహించారు. 19వ వార్డులో వినాయక మండపం వద్ద అన్న సంతర్పణను కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. రఘురాంనగర్‌లో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహిళలకు ముగ్గులు పోటీలను నిర్వహించారు.

నకరికల్లు: మండలంలోని గ్రామాల్లో వినాయకచవితి పర్వదినం సందర్భంగా గణేష్ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చిన్నా పెద్ద విగ్రహాలు కలిపి సుమారు 100కు పైగా ఏర్పాటు చేసుకున్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ ఎ.బాలకృష్ణ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను వినాయక చవితి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద మట్టి వినాయక ప్రతిమను ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించారు.

సత్తెనపల్లి: హెల్ప్ ఫౌండేషన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాలెంపాటి సౌజన్య సహకారంతో పట్టణంలోని తాలూకా సెంటరులో ఉచితంగా మట్టి వినాయ ప్రతిమలు సోమవారం పంపిణీ చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఎస్ఐ తులసి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మట్టి వినాయక బొమ్మలను పూజిస్తే.. ప్రకృతిని, భగవంతుని పూజించినట్లేనన్నారు. సౌజన్య మాట్లాడుతూ హిందూ సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పే పండుగలను కాలుష్య రహితంగా జరుపుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు సురేష్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం జయంతీ కాలనీలోని కోదండరామస్వామి దేవాలయంలో శ్రీవైష్ణవ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో 64 వినాయక విగ్రహాలు కొలువుదీరినట్లు ఎస్ఐ ఎం.నారాయణ తెలిపారు. అమరావతి, గోవిందపురం సమీపంలో ఉన్న కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు పోలీసుల అనుమతి తీసుకున్నారు.

అచ్చంపేట: విఘ్నాలకు అధిపతి గణనాథుని నవరాత్రి మహోత్సవాలు భక్తశ్రద్ధలతో ప్రారంభమైనాయి. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇటుక బట్టీ నిర్వహకుల ఆధ్వర్యంలో నెలకొల్పిన ఎత్తైన వినాయక విగ్రహం ఆకట్టుకుంటోంది. కాకతీయ సేవా సంఘం ఆధ్వర్యంలో గణనాథుడికి విగ్రహాన్ని కొలుదీర్చారు. వర్తక సంఘం సభ్యులు స్థానిక సీతారామస్వామివారి దేవాలయంలో బొజ్జ గణపయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. దాసుళ్ల బజారులోని రామాలయం, వాగొడ్డున ఆంజనేయస్వామివారి దేవాలయం, ఎస్టీ కాలనీలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు.

అమరావతి: మండలంలో సోమవారం వినాయక చవితి సందర్భంగా ప్రతి గ్రామంలోని కూడళ్లలో వినాయక చవితి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన అమరావతిలో పలు సెంటర్‌లలో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరునికి వినాయచవితి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి, విశేషాలంకారం చేసి వినాయకునికి గరికతో సహస్రనామార్చన నిర్వహించారు. వినాయకునికి పంచామృతాలతో అభిషేకించి అనంతరం గరికతో పూజించాలన్నారు. పాల్గుణమాసం లో వినాయకునికి పూజలు చేస్తే స్వామివారి అనుగ్రహం మెండుగా ఉంటుందన్నారు.

క్రోసూరు: వినాయ చవితి పండుగ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రోసూరులోని రెడ్లబజారులో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండలంలో నవ దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెదకూరపాడు: పెదకూరపాడులో నడిగడ్డ, మిట్ట ప్రాంతం, నాగేంద్రస్వామి దేవాలయం, 75 త్యాళ్లూరు, లగడపాడు గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదకూరపాడులో భారీ ఊరేగింపు నిర్వహించారు. దేవతల వేషధారణల్లో కళాకారులు అలరించారు.

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవితి వేడుకలను సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండ, చంద్రాజుపాలెం, నాగిరెడ్డిపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, కందిపాడు, నందిరాజుపాలెం గ్రామాలలో అధిక సంఖ్యలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామాలలోని ప్రతి వీధిలోనూ వినాయకుని విగ్రహాలు దర్శనమిచ్చాయి. నాగిరెడ్డిపాలెం, మాచాయపాలెం గ్రామాలలో వినాయక చవితి వేడుకలలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.



మిట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ తులసీ



అచ్చంపేటలో కొలుదీరిన గణనాథుడు



చవితి పూజల అనంతరం అమరేశ్వరాలయంలో వినాయకస్వామి



పెదకూరపాడు నడిగడ్డలో వినాయక విగ్రహం



క్రోసూరు రెడ్ల బజారులో వినాయచవితి వేడుక

ప్రారంభమైన నిమజ్జనాలు

అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి కృష్ణానదిలో వినాయక విగ్రహా నిమజ్జనం ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా గణేష్ విగ్రహాలు తరలివస్తున్నాయి. నది ఒడ్డున ధ్యాన బుద్ధ ఘాట్ వద్ద పోలీసులు నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు. రింగురోడ్డు నుంచి ధ్యాన బుద్ధ ఘాట్ వరకు అన్ని కూడళ్లలో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీఐ.బ్రహ్మం తమ సిబ్బందితో గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. కృష్ణానది మధ్యలోకి పడవల సహాయంతో వినాయక విగ్రహాలను తీసుకువెళ్లి నిమజ్జనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



క్రేన్ సాయంతో వినాయక విగ్రహాన్ని పడవలోకి దించుతున్న దృశ్యం

పేదల నాయకుడు ఎమ్మెల్యే నంబూరు

- ఘనంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జన్మదిన వేడుకులు
- హాజరైన మంత్రి మేరుగ నాగర్జున, ఎమ్మెల్యేలు ముస్తాఫా, మద్దాలి గిరిధర్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, డొక్కా, పలువురు నాయకులు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెదకూరపాడు: పేదలకు మంచి చేయడానికి అనుక్షణం తపించే నాయకుడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగర్జున అన్నారు. సోమవారం పెదకూరపాడు శాశన సభ్యులు నంబూరు శంకరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కేరళ సంప్రదాయ వాయిద్యాల మధ్య అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే శంకరరావు నివాసం నుంచి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి క్యాంప్ కార్యాలయం వరకు భారీ బైక్, కార్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మేరుగ నాగర్జున, ఎమ్మెల్యేలు గిరధర్, ముస్తాఫా, ఎమ్మెల్సీ అపిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రాతంశెట్టి రామాంజనేయులు, మిర్చియార్డ్ డైరెక్టర్ నిమ్మకాయల రాజనారాయణ, గుంటూరు నగర కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగర్జున మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన శంకరరావును పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు మరొసారి గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ, గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. నిస్వార్థ సేవకు ప్రతిరూపం నంబూరు శంకరరావు అని అన్నారు. ఎమ్మెల్యే ముస్తాఫా మాట్లాడుతూ అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం పని చేసే వ్యక్తి నంబూరు శంకరరావు అన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు వెనుక శంకరరావు కృషి ఉందన్నారు. అందుకే కార్పొరేటర్లు అందరూ కలిసి శంకరరావు జన్మదిన వేడుకులు జరిపించారన్నారు.

పలు సేవా కార్యక్రమాలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జన్మదినం సందర్భంగా గుంటూరులోని తన కార్యాలయం నందు పేదలకు పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, యార్డు చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పలు విభాగాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొని ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అ నంతరం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు వినాయచవితి వేడుకుల్లో పాల్గొన్నారు.

క్రోసూరు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు గుంటూరులోని ఆయన కార్యాలయంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, మండలాధ్యక్షుడు వెలది అప్పారావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుములకోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ షరీఫ్ ఉన్నారు. ఈ సందర్భంగా దొడ్లేరు గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెదకూరపాడు: పెదకూరపాడు శాశన సభ్యుడు నంబూరు శంకరరావు పుట్టిన రోజు వేడుకులు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడులో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు నల్లపాటి యోహాన్ అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. లగడపాడు, 75త్యాళ్ళూరు. పాటిబండ్ల , హుస్సేన్‌నగరం , కంభంపాడు, బలుసుపాడు, తమ్మవరం కన్నెగండ్ల గ్రామాల్లో పుట్టి రోజు వేడుకులు ఘనంగా నిర్వహించి పలు సేవ కార్యక్రమాలు చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభలు

మన కోసం– మన శంకరన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మండెపూడి గ్రామసభలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రజా సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించాలనే లక్ష్యంగా మన కోసం – మన శంకరన్న పేరుతో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం మండెపూడిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ ప్రజలు తన దష్టికి తీసుకొచ్చిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయో.. ఆయన తెలుసుకున్నారు. ఇంకా ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి అన్న విషయాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందడం లేదని వచ్చిన ఫిర్యాదులను నూటికి నూరుశాతం పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యలను 90 శాతానికి పైగా పరిష్కరించినట్లు తెలిపారు. ఎస్సీ కాలనీ స్మశాన వాటిక దగ్గర త్వరలోనే కల్వర్టు నిర్మిస్తామన్నారు. శివాలయం దగ్గర వద్ద పైపులైన్ సమస్యను ఉపాధి హామీ పనుల ద్వారా పూర్తిచేస్తామన్నారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండెపూడి నుంచి పరస వరకు రోడ్డుకు కోసం రూ.1.5 కోట్లు మంజూరయ్యాయని.. త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అలాగే నరుకుళ్లపాడులో మధ్యాహ్నం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో ఎస్టీ కాలనీలో డ్రెయిన్, 11 కేవీ విద్యుత్ లైన్ తో పాటు కొన్ని రోడ్లు పూర్తి చేయాల్సి ఉందని.. వీటినంత త్వరలో అన్నింటినీ పూర్తి చేస్తానని ఎమ్మెల్యే శంకరరావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. నూతనంగా మంజూరైన పెన్షన్లు, ఓటీఎస్ ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ హష్మి, మండల సచివాలయాల కన్వీనర్ నాయుడు రాంబాబు, మండెపూడి సర్పంచ్ పిల్లుట్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కోట వెంకటేశ్వరరావు, నరుకుళ్లపాడు ఉప సర్పంచ్ నల్లిబోయిన శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మన కోసం –మన శంకరన్న కార్యక్రమాలు..

క్రోసూరు/అచ్చంపేట: క్రోసూరు మండలంలోని ఊటుకూరు గ్రామం, అచ్చంపేట మండలంలోని కస్తల, కోనూరు గ్రామంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మన కోసం – మన శంకరన్న గ్రామ సభలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాళీ స్థలాల్లో అద్దె వేలంపాట

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరుగ్రామంలో వేంచేసియున్న వేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించి ఖాళీస్థలాలు అద్దె వేలంపాట నేడు(బుధవారం) నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అధికారి బండి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ చట్టం ప్రకారం ఈ వేలంపాటలు నిర్వహిస్తామని, ఉదయం 10 నుంచి స్థానిక ఆలయంలో వేలంపాట ఉంటుందన్నారు. అద్దె కాల పరిమితి 3 ఏళ్ళపాటు ఉంటుందని, 2023, నవంబర్ 11 నుంచి 2026 నవంబర్ 10 వరకు ఉంటుందన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఒక్కొక్క ప్లాటుకు రూ.5వేలు చొప్పున ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనలు వర్తిస్తాయని ఈఓ తెలిపారు.

సత్తెనపల్లి కళాకారులకు పురస్కారాలు





పురస్కారాలు అందుకుంటున్న రమాదేవి, రవికుమార్

సత్తెనపల్లి: తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారి ఆధ్వర్యంలో హైదరాబాదు శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా వెంకట దీక్షితులు కళావేదికపై తెలుగు భాషా దినోత్సవం -2023 పురస్కారాలు ప్రధానోత్సవం నిర్వహించారు. సత్తెనపల్లికి చెందిన ఇద్దరు వివిధ రంగాల్లో ప్రావీణ్యం కనబరిచి జాతీయ స్థాయిలో పురస్కారాలను ఈ నెల 17న అందుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల స్థాయిలో మొత్తం 150 మందికి వివిధ రంగాల్లో ప్రావీణ్యం కనబరచడంతో పురస్కారాలను అందించారు. సత్తెనపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయని సరికొండ రమాదేవికి తెలుగు వెలుగు లెజెండరీ పురస్కారం అందించగా, బెజ్జగం రవికుమార్‌కు విశిష్ట కళా ప్రపూర్ణ పురస్కారాన్ని అందించారు.

తప్పులు లేని ఓటరు జాబితాకు ప్రణాళిక



మాట్లాడుతున్న ఆర్డీవో రాజకుమారి

సత్తెనపల్లి: తప్పులులేని ఓటరు జాబితా తయారీ కోసం పటిష్ట చర్యలు చేపట్టామని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ -2024 లో భాగంగా ప్రీ రివిజన్ ఆక్టివిటీస్, హౌస్ టు హౌస్ సర్వే, డెత్, డూప్లికేట్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు తదితర అంశాలను, పోలింగ్ స్టేషన్‌ల రేషన్‌లైజేషన్‌పై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో ఏఈఆర్వోలు, తహసీల్దార్లు ఎస్.సురేష్ (సత్తెనపల్లి) ఎం.భవానీ శంకర్(ముప్పాళ్ళ) అఫ్రీపున్నీసా బేగం (రాజుపాలెం), సత్తెనపల్లి, నకరికల్లు సీనియర్ అసిస్టెంట్లు బోస్‌బాబు, రాజగోపాలరెడ్డి, మున్సిపల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మోహిబ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.